సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ఓటరు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. -8లో



వైఎస్సార్‌సీపీలో చేరికలు

గుర్రంకొండ మండలం నరిమడుగు, ఓబుల వారిపల్లె మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 185 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	321	472
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 439.440 కిలోలు

న్యూస్‌రీల్

చిరుత సంచారం

తంబళ్లపల్లె: మండలంలోని మద్రిమాకులపల్లె సమీపగుట్టల్లో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని సర్పంచ్ కె.జ్యోతి విలేకరులకు తెలిపారు. శుక్రవారం సమీప పొలాల గుండా కన్నెమడుగు గుట్టప్రాంతానికి చిరుత వెళ్లినట్లు పొలాల్లోని పలువురు రైతులు చూసి కేకలు వేశారన్నారు. 4 రోజుల క్రితం లక్కసముద్రం ఊసలగుట్ట నుంచి చిరుత రావడం చూసినట్లు జీవాల కాపర్లు తెలిపారన్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నగదు పట్టివేత

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా కడపలోని అప్సరా సర్కిల్‌లో బైక్‌పై వెళుతున్న ప్రకాష్‌నగర్‌కు చెందిన పోతురాజు పవన్‌కల్యాణ్ దగ్గరి నుంచి రూ.5,93,630 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ట్రెజరీలో సమర్పించి, రిపోర్ట్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇచ్చారు. ఈ నగదును పట్టుకోవడంలో చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐ రవి కుమార్, సిబ్బంది తమ వంతు కృషి చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెండ్లిమర్రి: వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి, వెల్లటూరు, కొత్తగిరియంపల్లె, తిప్పిరెడ్డిపల్లె, గంగనపల్లె, మొయిళ్లకాల్వ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్‌కు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఆర్‌ఐ శ్రీను, వీఆర్వోలు పాల్గొన్నారు.

14న ప్రైవేట్ విద్యా సంస్థల సమావేశం

కడప రూరల్: ఏపీ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కేజీ టు పీజీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన కడపలో సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. సమస్యల పరిష్కారంపై చర్చించడానికి ఈ నెల 14వ తేదీన కడపలోని చెన్నై రోడ్డులో గల క్రిష్ణా కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

శ్లాస్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లాలో ఈ నెల 16వ తేదీన 121 స్కూళ్లలో 4వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న స్టేట్ లర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే(శ్లాస్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. శుక్రవారం కడపలో జిల్లాలోని ఎంఈఓలు, సీఆర్‌పీలకు శ్లాస్ పరీక్ష నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదవడం, రాయడమే ఈ శ్లాస్ పరీక్ష నిర్వహణ ముఖ్య ఉద్దేశమన్నారు.

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు–2024లో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించిందన్నారు. దీంతో జిల్లాలో ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల ర్యాండమైజేషన్ కోసం నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు తెలిపారు. సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట పోలీస్ బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎం, వివి ప్యాట్స్ యంత్రాలను తరలిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో అన్నమయ్యకు 22వ స్థానం.
- పరీక్షలకు 25,249 మంది విద్యార్థులు హాజరు



రాయచోటి: ఇంటర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో అన్నమయ్య జిల్లా 69 శాతం ఉత్తీర్ణతతో 22వ స్థానంలో నిలిచింది. అన్నమయ్య జిల్లా నుంచి మొదటి, రెండు సంవత్సరాలకు 26,638 మంది విద్యార్థులకు 25,249 మంది పరీక్షలకు హాజరయ్యారు. ప్రభుత్వ కళాశాలల నుంచి 10389 మందికి 9829 మంది పరీక్షలు రాయగా 6073 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు కళాశాలల నుంచి 16333 మందికి 15420 మంది హాజరవ్వగా 9173 మంది పాసయ్యారు. మొత్తం మీద జిల్లాలో 15246 మంది ఉత్తీర్ణత సాధించి 69 శాతంతో రాష్ట్రంలో 22వ స్థానాన్ని పొందారు. మార్చినెల 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలలో అన్నమయ్య జిల్లా నుంచి 25,249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో మొదటి సంవత్సరం 12978 మంది, రెండో సంవత్సరం 10384 మంది, ఒకేషనల్ మొదటి సంవత్సరం 1045, రెండో సంవత్సరంలో 842 మంది పరీక్షలు రాశారు. ఈ ఫలితాల్లో కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా నిలిచింది. మొదటి సంవత్సరంలో బాలురు 43 శాతం ఉత్తీర్ణత కాగా బాలికలు 62 శాతం, రెండో సంవత్సరంలో బాలురు 62 శాతం, బాలికలు 75 శాతం, ఒకేషనల్ పరీక్షల్లో బాలురు ఫస్టియర్ 47 శాతం, బాలికలు 66 శాతం, సెకండియర్‌లో బాలురు 56 శాతం, బాలికలు 79 శాతం ఉత్తీర్ణత సాధించారు.

- ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేదీ నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నారు.

ఉత్తమ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

శుక్రవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు.

- మదనపల్లి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో రెండోసంవత్సరం ఎంపీసీకి చెందిన ఎస్.తహూర సమర్ 1000 మార్కులకు 979 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.
- మదనపల్లె బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో బైపిసి విద్యార్థిని గీతా మాధురి 1000 మార్కులకు గాను 964 మార్కులు సాధించింది.
- మదనపల్లె బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో సీఈసీ విద్యార్థిని ఎస్.సమీర కౌషార్ 1000 మార్కులకు గాను 951 మార్కులు రాబట్టింది.
- రాయచోటి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో రెండో సంవత్సరం హెచ్ఈసీ విద్యార్థిని కుష్‌బూర్ 1000 మార్కులకు 964 మార్కులు సాధించింది.
- మదనపల్లె బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థిని షేక్ సబుల్ ఫిర్‌దోస్ 440 మార్కులకు గాను 431 మార్కులు సాధించింది.
- రాయచోటి బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో బైపీసీ విద్యార్థి షేక్ అరిఫుల్లా 440 మార్కులకు 431 మార్కులు సాధించాడు.
- కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో సీఈసీ విద్యార్థిని సి.రెడ్డి హేమావతి 500 మార్కులకు 473 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు.
- గుర్రంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో ఎంపీసీ విద్యార్థిని షేక్ నబీద 470 మార్కులకు 453 మార్కులు సాధించింది.

ఫలితాలు ఇలా...

ఫస్టియర్ బాలురు: 6188 మంది పరీక్షలు రాయగా అందులో 2678 మంది ఉత్తీర్ణత సాధించి 43 శాతంగా రాణించారు.
బాలికలు: 6790 మంది పరీక్షలకు హాజరు కాగా 4208మంది ఉత్తీర్ణత సాధించి 62 శాతంగా నిలిచారు.
సెకండియర్ బాలురు: 4908 మంది పరీక్షలు రాయగా అందులో 3039 మంది ఉత్తీర్ణత సాధించి 62 శాతంగా రాణించారు.
బాలికలు: 5476 మంది పరీక్షలకు హాజరు కాగా 4114 మంది పాసై 75 శాతంగా రాణించారు.
ఫస్టియర్ ఒకేషనల్ బాలురు: 407 మంది పరీక్షలు రాయగా అందులో 192 మంది ఉత్తీర్ణత సాధించి 47 శాతంగా రాణించారు.
బాలికలు: 638 మంది పరీక్షలకు హాజరు కాగా 423 మంది ఉత్తీర్ణత సాధించి 66 శాతంగా నిలిచారు.
సెకండియర్ ఒకేషనల్ బాలురు: 311 మంది పరీక్షలు రాయగా అందులో 174 మంది ఉత్తీర్ణత సాధించి 56 శాతంగా రాణించారు.
బాలికలు: 531 మంది పరీక్షలకు హాజరు కాగా 418 మంది పాసై 79 శాతంగా రాణించారు.

ముగిసిన గంగమ్మ జాతర

- అమ్మవారి ప్రతిమను ఊరేగిస్తూ పొలిమేర్లకు తరలింపు
- నైవేద్యాలు సమర్పణ
- లక్షలాదిమంది భక్తుల హాజరు
- కోటిరూపాయిలకు పైగా వ్యాపారం

రాజంపేట టౌన్: రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లె గ్రామంలో రెండు రోజులుగా జరిగిన గంగమ్మ జాతర వేడుకలు వైభవంగా ముగిశాయి. బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన జాతర శుక్రవారం అమ్మవారిని ఊరేగింపుగా పొలిమేర్లకు సాగనంపడంతో ఈ ఏడాదికి జాతర ఘట్టం పరిసమాప్తమైంది. గంగమ్మను భక్తుల చేతులమీదుగా ఊరేగించారు. ఈసందర్భంగా పలువురు గంగమ్మకు ఇష్టమైన నైవేద్యాలను ఎదురుగుంభంగా సమర్పించారు. అమ్మవారి ఊరేగింపులో భాగస్వాములు అయ్యేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆసాదులు దారిపొడవునా కథ చెబుతూ దీవెనలిస్తూ సాగారు. ఈసందర్భంగా ఆసాదులు జాతర నిర్వాహకుల ఇంటిపేర్లతో, ప్రజాప్రతినిధుల, పట్టణ ప్రముఖుల పేర్లను జోడించి చేసిన దీవెనలను ఆసాదుల కథను వినేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది కూడా జాతరలో భక్తులు దాదాపు లక్షమంది పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు అంచనావేశారు.

కోటిరూపాయిలకు పైగా వ్యాపారం

బలిజపల్లె గంగమ్మ జాతరను పురస్కరించుకొని వివిధ రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. వందలాది మంది గంగమ్మకు నైవేద్యాలుగా పొట్టేళ్ళు, మేకపోతులు, కోడిపుంజులు వంటివి సమర్పించారు. అలాగే బలిజపల్లె గ్రామంలోనే కాక పరిసర ప్రాంతాల్లో వ్యాపారులు పెద్ద ఎత్తున వివిధ రకాల దుకాణాలను ఏర్పాటు చేశారు.భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో జాతరలో అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. కోటి రూపాయిలకు పైగా వ్యాపారం జరిగివుంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

పటిష్ట బందోబస్తుతో ప్రశాంతంగా జాతర

పోలీసు అధికారులు, సిబ్బంది విశేష కృషి ఫలితంగా బలిజపల్లె గంగమ్మ జాతర ప్రశాంతవాతావరణంలో ముగిసింది. డీఎస్పీ వీఎన్‌కే.చైతన్య ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ సీఐలు, ఎస్‌ఐలు, వివిధ పోలీస్ స్టేషన్‌లకు చెందిన పోలీసు సిబ్బంది జాతర ముగిసే వరకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారు. ఎలాంటి అవాఛనీయ సంఘటనలు చోటు పోలీసులు తీసుకున్న చర్యలకు భక్తుల నుంచి ప్రసంశలు లభించాయి.



గంగమ్మను ఊరేగింపుగా పొలిమేర్లకు తీసుకెళుతున్న భక్తులు

వైభవం.. ధ్వజారోహణం



ధ్వజారోహణ చేస్తున్న వేదపండితులు



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీ పట్టాభిరాముడు

పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీ క్రోధినామ సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి టీటీడీ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపజేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి,సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ పాల్గొన్నారు.

గజవాహనంపై శ్రీ పట్టాభిరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు పట్టాభిరాముడు రాత్రి 8గంటల నుంచి 10గంటల వరకు గజవాహనంపై తిరుమాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాల నడుమ గజవాహనసేవ జరిగింది.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ముత్యపుపందిరి వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి హనుమంత వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

టెండర్లు వేయడం కాదు..పనులు పూర్తి చేయండి

టూరిజం ఈడీ మల్‌రెడ్డి సమీక్ష



హార్సిలీహిల్స్ గవర్నర్ బంగ్లాపై ఈడీ, అధికారుల పరిశీలన

బి.కొత్తకోట: టెండర్లు వేయడం కాదు సత్వరమే పనులు పూర్తి చేయాలని పర్యాటకశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆరవేటి లక్ష్మి మల్‌రెడ్డి కాంట్రాక్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌పై శుక్రవారం ఆయన టూరిజంశాఖ సాంకేతిక అధికారులు, కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్చర్‌లతో పనులపై సమీక్షా సమావేశం జరిపారు. తొలుత ఆయన రూ.10 లక్షల వ్యయంతో పూర్తి చేసిన మైనర్ పనులు, అతిథిగృహాల్లో, బార్, రెస్టారెంట్, తదితర వాటికి వేసిన పెయింటింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనుల్లో నాణ్యత ఎక్కడుందని సాంకేతిక అధికారులను ప్రశ్నించారు. రెస్టారెంట్‌కు ఓ రాజకీయ పార్టీకి చెందిన రంగు వేశారని, వేసిన రంగులు నాసిరకంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కొండపై చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సాధారణ సందర్శకుల కోసం ఒక డార్మెంటరీని నిర్మించడం జరుగుతుందని చెప్పారు. ఈ పనులు పూర్తి చేయించేందుకు రూ.13కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. నెలల క్రితమే టెండర్ల నిర్వహణ, పనుల అప్పగింత చర్యలు పూర్తయిందని చెప్పారు. ఈ పనులు నాణ్యతగా ఉండేలా సాంకేతిక అధికారులు నిత్యం పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఈడీ మల్‌రెడ్డి అధికారులతో హార్సిలీహిల్స్‌పై ఉన్న టూరిజం అతిథి గృహాలన్నింటిని పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ సీఎస్ఎన్.మూర్తి, ఈఈ సుబ్రమణ్యంరాజు, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ నేదురుమల్లి సాల్విన్‌రెడ్డి, ఆర్కిటెక్చర్ సైయార్క్, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

ప్రగతి పథం.. నవోత్సాహం

- పునర్విభజనకు రెండేళ్లు
- జిల్లా ఏర్పడిన తర్వాత ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు
- కేంద్రీయ విద్యాలయాలతోపాటు ఆహ్లాదానికి శిల్పారామాలు, నగర వనాలు
- వైద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెడికల్ కళాశాల
- అత్యుత్తమ వైద్యానికి పీలేరు, రాయచోటిలలో 100 పడకల ఆస్పత్రుల ఏర్పాటు



రాయచోటిలోని వంద పడకల ఆస్పత్రి

సాక్షి రాయచోటి: చారిత్రాత్మక ఘట్టానికి రెండేళ్ల పూర్తి చేసుకుని మూడో ఏడాదిలోకి అడుగు పెట్టింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022 ఏప్రిల్ 4న ఆవిర్భవించిన అన్నమయ్య జిల్లా అందంగా రూపుదిద్దుకుంది. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లాలోని ఆరు నియోజకవర్గాలను జిల్లాగా మార్చడంతో నూతన ఒరవడికి నాంది పలికారు. కొత్త జిల్లాగా పురుడు పోసుకున్న రెండేళ్లలోనే అన్ని సమస్యలను అధిగమించి నూతన సొకర్యాలతో పాత జిల్లాలతో పోటీ పడుతూ కొత్త జిల్లా అన్నమయ్య నవశకం వైపు పయనిస్తోంది.

- చారిత్రక ప్రాశస్త్యం కలిగిన రాయచోటి ప్రాంతం అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి నూతన శకం ఆరంభమైంది. ఒకప్పుడు ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయంగా ఉంటూ తాగునీటితో పాటు అనేక సమస్యలు ఎదుర్కొవాల్సి వచ్చేంది. అయితే మారిన పరిస్థితులు, మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పలు ప్రాజెక్టుల నిర్మాణంతో తాగునీటి సమస్యను రూపుమాపగా ఆయన తనయుడు అన్నమయ్య పేరుతో కొత్త జిల్లాను సృష్టించి పాలనను ప్రజలకు దగ్గర చేశారు.

ఒనగూరిన సౌకర్యాలు

అన్నమయ్య జిల్లాగా ఏర్పడిన కొత్త జిల్లాకు సంబంధించిన పాలన ప్రారంభించిన నాటికే వసతులు ఒనగూరాయి. సుమారు 102కు పైగా శాఖలకు సంబంధించి వేలాది మంది ఉద్యోగులు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఎక్కడా కూడా ప్రైవేటు భవనాలు కాకుండా ప్రభుత్వ భవనాల్లోనే సర్దుబాటు చేశారు. దీంతో ప్రత్యేకంగా అద్దె బాధలు తప్పి పోగా, కార్యాలయాల్లోనే పనులు సజావుగా సాగిపోతున్నాయి. ప్రజలకు అధికారులు కూడా దగ్గర కావడంతో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతూ వస్తున్నాయి.

- 2022 ఏప్రిల్ 4వ తేదీన కొత్త జిల్లాలు ఆవిర్భవించాయి. అప్పటి నుంచి ఎక్కడికక్కడ అధికారులు అందుబాటులోకి రావడంతో ప్రజల వద్దకే పాలన వచ్చింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఇతర జిల్లా అధికారులందరూ జిల్లా కేంద్రానికి రావడం...పునర్విభజనలో జిల్లాలు చిన్నవి కావడంతో ప్రజల సమస్యలు కూడా వేగంగా పరిష్కారం అవుతున్నాయి.
- జిల్లా ఆవిర్భవించి రెండేళ్ల పూర్తయింది. జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రభుత్వం ఎంపిక చేసి పరిపాలన అందించేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరు నియోజకవర్గాలు, 30 మండలాలతో జిల్లా ఏర్పడింది. దీంతో ప్రజలకు అన్ని సౌకర్యాలు ఒనగూరాయి. జిల్లా కేంద్రం నుంచి చుట్టుపక్కల మండలాలకు వెళ్లాలన్నా 120 కిలోమీటర్లలోపు ఉండడంతో అధికారుల పర్యటనలో కూడా వేగంగా సాగిపోతున్నాయి. కొత్త పాలనలో ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విస్తీర్ణం: 7951 చ.కి.మీ.		జనాభా: 16.97 లక్షలు
మండలాలు: 30	అసెంబ్లీ నియోజకవర్గాలు: 06	పురుషులు: 8.53 లక్షలు
గ్రామాలు: 5673	పార్లమెంటు నియోజకవర్గాలు: 01	మహిళలు: 8.44 లక్షలు
రెవెన్యూ గ్రామాలు: 471	మున్సిపాలిటీలు: 03	పట్టణాల జనాభా: 13.06 లక్షలు
గ్రామ పంచాయతీలు: 502	నగర పంచాయతీలు: 01	గ్రామీణ జనాభా: 3.91 లక్షలు

ప్రగతి పరుగులు

అన్నమయ్య జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతోంది. ప్రధానంగా రాయచోటిలో క్రీడలకు సంబంధించి క్రికెట్ స్టేడియం, ప్రజల ఆహ్లాదానికి మున్సిపల్ పార్కు, శిల్పారామం, నగర వనాలు (పనులు జరుగుతున్నాయి), నూతన మున్సిపల్ కార్యాలయం, సర్కిళ్లలో మహా నాయకులు, మహాత్ముల విగ్రహాలు, డివైడర్ల ఆధునీకరణ, ఆర్అండ్‌బీ అతిథి గృహం, ఆర్టీసీ బస్టాండు ఆధునీకరణ, రైతు బజారు ఏర్పాటు, ట్రాఫిక్ పోలీసుస్టేషన్, డీఎస్పీ కార్యాలయం, మదనపల్లెలో మెడికల్ కళాశాల, మదనపల్లె బీటీ కళాశాల యూనివర్సిటీగా అప్‌గ్రేడ్, మదనపల్లె, రాయచోటిలలో కేంద్రీయ విద్యాలయాలు, పీలేరు, రాయచోటిలలో 100 పడకల ఆస్పత్రులు, తంబళ్లపల్లె, పీలేరు సమీపంలో పలు పరిశ్రమల ఏర్పాటు, తిరుపతి–పీలేరు మధ్య ఆరు వరుసల రహదారి, రాయచోటిలో నూతన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు రూ.100 కోట్లు కేటాయింపు, రాజంపేట ప్రాంతంలో రూ. 85 కోట్లతో పింఛా ప్రాజెక్టు... ఇలా చెబుతూపోతే జిల్లా వివిధ రంగాల్లో ఈ రెండేళ్లలో ఊహించిన దానికంటే నూతన జిల్లా ఎక్కువ పురోగతి బాట పట్టింది. ఒక్కటేమిటీ అన్ని నియోజకవర్గాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో కొత్త కళ ఉట్టిపడుతోంది.

ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: బెంగళూరు మార్తహళ్లిలోని ఎస్‌బీఆర్ ప్యాలెస్‌లో ఈ నెల 13వ తేదీ నిర్వహించే కడప పార్లమెంటు నియోజకవర్గ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ నివాసంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వివేక్ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులో ఉన్న తెలుగువారందరినీ ఒక వేదికపైకి తెచ్చి జగనన్న పాలన గురించి, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బెంగళూరులో ఉన్న తమ బంధుమిత్రులను ఈ సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జిల్లా మైనారిటీ విభాగ అధ్యక్షుడు చాన్ బాషా, నగర అధ్యక్షుడు పవర్ అల్తాఫ్, కార్పొరేటర్ షంషీర్, గౌస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన రెడ్డి శేఖర్ (ఫైల్)

వాల్మీకిపురం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లి రోడ్డులో చోటు చేసుకొంది. వివరాలు.. మండలంలోని జర్రావారిపల్లికి చెందిన రెడ్డిశేఖర్ (25), అనీల్ (25)లు దినసరి కూలీలుగా పని చేస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇరువురు కూలిపని నిమిత్తం మదనపల్లికి వెళ్లి పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యాయి. ఈ నేపథ్యంలో రాత్రి 7గంటల సమయంలో ద్విచక్రవాహనంలో స్వగ్రామమైన జర్రావారిపల్లికు ఇరువురు బయల్దేరారు. వాల్మీకిపురం సమీపంలోని బోగంపల్లి సమీపంలో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద తిరుపతి నుంచి మదనపల్లికు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డిశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనీల్ తీవ్ర గాయాలతో ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లికు రెఫర్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ నాగేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20 లక్షల నగదు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు చూపిస్తున్న డీఎస్పీ చైతన్య, సీఐ మద్దయ్య ఆచారి

రాజంపేట : పట్టణంలోని ఎర్రబలిలో నివసిస్తున్న నరేష్ అనే వ్యక్తి ఇంటిలో రూ.20లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి ఆధారాలు లేకుండా లభ్యమైన నగదును స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. రాజంపేట సీఐ మద్దయ్య ఆచారి మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు నరేష్ ఇంటిలో తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీలలో రూ.20లక్షలు నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదుకు తగిన ఆధారాలు లేవన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్


సమావేశంలో ఎస్పీతో కలిసి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి : జిల్లాలో ఓటరు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమంగా తరలించే నగదు, మద్యం, గంజాయి, వస్తువులపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారుల సమీక్షలో సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్, ఇన్‌కమ్ టాక్స్, కమర్షియల్ టాక్స్, ఎన్నికలకు సంబంధించిన వివిధ విభాగాల నోడల్ అధికారులు తదితరులతో జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మోడల్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.5.74 కోట్ల విలువైన నగదు, సిల్వర్, మద్యం, గంజాయి తదితరాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అవగాహన చేసుకుని పారదర్శకంగా ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నగదు వస్తువులను సీజ్ చేసేటపుడు నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని తెలిపారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ విలువైన నగదు లేదా వస్తువులను గుర్తిస్తే ఈఎస్ఎంఎస్‌లో నమోదు చేసి వివరాలను ఆదాయపు పన్ను, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు పంపించాలని ఆదేశించారు. గత ఏడాది ఇదే సమయంలో జరిగిన మద్యం అమ్మకాలు, ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాలపై దృష్టి పెట్టి అమ్మకాలు పెరిగిన ప్రాంతాలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మద్యం డిపోలు డిక్షనరీస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.

ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి 767 లైసెన్స్‌డ్ వెపన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోలీస్ శాఖ పరంగా 232 లొకేషన్స్‌లోని 398 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద తగిన బందోబస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాకు చేరుకున్న మూడు కేంద్ర కంపెనీ బలగాలతో అన్ని నియోజకవర్గాలలో ఇప్పటికే 104 ఫ్లాగ్ మార్చ్ చేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఆర్ఓ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులపై నిఘా పెట్టండి

- ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య
- బార్డర్ చెక్‌పోస్టుల తనిఖీ, సిబ్బందికి సూచనలు
- జిల్లాలో ఎస్ఈబీ పనితీరుపై సమీక్ష


బి.కొత్తకోట రానామిట్ట చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సరిహద్దు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ఎన్నికల కమిషన్ నిషేధించిన వస్తువులు ప్రవేశించకుండా ఎస్ఈబీ సిబ్బంది చెక్‌పోస్ట్‌ల వద్ద కట్టడి చేయాలని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. శుక్రవారం మదనపల్లె పర్యటనలో భాగంగా ఆయన.. బి.కొత్తకోట మండలంలోని రానామిట్ట, బురకాయలపల్లె, మదనపల్లె మండలం చీకలబైలు అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలుసూచనలు ఇచ్చారు. వాహన తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులపై నిఘా పెట్టాలన్నారు. అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ల్లో గస్తీ ముమ్మరం చేసి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నిషేధిత వస్తువులు రాష్ట్రంలోకి ప్రవేశించకుండా కట్టడి చేయాలన్నారు. అనంతరం మదనపల్లె ఎస్ఈబీ కార్యాలయంలో జిల్లాలోని 8 ఎస్ఈబీ స్టేషన్లు, మదనపల్లె, రాయచోటి డీటీఎఫ్‌టీమ్‌లతో అన్నమయ్యజిల్లాలో ఏడాదికాలంగా నమోదైన కేసులు, తదితరాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు.. ఫిబ్రవరి 26, 2023 నుంచి ఏప్రిల్ 11, 2024 వరకు జిల్లాలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో కేసుల వివరాలను వెల్లడించారు. జిల్లాలో మొత్తం 1,083 కేసుల్లో 753 మందిని వివిధ నేరాలపై అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ రమేష్‌రెడ్డి, డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపు సేల్స్‌మెన్స్ అరెస్ట్

- అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం
- ఎస్ఈబీ దాడుల్లో 46 లీటర్ల నాటుసారా, మూడు వాహనాలు సీజ్


ప్రభుత్వ దుకాణం నుంచి సేల్స్‌మెన్ తరలిస్తున్న మద్యంను చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : కంచె చేను మేసిన చందాన... ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులు.. షాపులోని మద్యాన్ని అక్రమంగా బయటకు తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా, ఎస్ఈబీ అధికారులు పట్టుకుని నిందితులను రిమాండ్‌కు పంపారు. ఎస్ఈబీ సీఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు...బసినికొండ ప్రభుత్వ మద్యం దుకాణంలో నీరుగట్టువారిపల్లెకు చెందిన వి.శివయ్య(38) సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి కోకిల బార్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, ఆటోడ్రైవర్ శివశంకర్‌లు స్నేహితులుగా ఉన్నారు. వీరిద్దరి సహాయంతో శివయ్య బసినికొండ ప్రభుత్వ మద్యం దుకాణంలోని 95.04 లీటర్లు మద్యం ఆటోలో తరలిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకునే క్రమంలో ఆటోలో ఉన్న మూడో నిందితుడు చంద్రశేఖర్‌రెడ్డి పారిపోవడంతో మిగిలిన ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆటోను సీజ్‌చేసి, సరుకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే.. పుంగనూరు నియోజకవర్గం ఈడిగపల్లెకు చెందిన కే.కిరణ్‌కుమార్(32) ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన గ్రామానికి చెందిన స్నేహితుడైన ఎం.చందూకుమార్(26)తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంలో 9 బాటిళ్ల మద్యం తరలిస్తుండగా, నిందితులను పట్టుకుని కేసు నమోదుచేసి, వాహనం, సరుకు సీజ్ చేశామన్నారు. వీటితో పాటుగా మదనపల్లె మండలం నారమాకులతండాకు చెందిన హరికృష్ణనాయక్ 46 లీటర్ల నాటుసారాను హోండాయాక్టివా వాహనంలో తరలిస్తుండగా, కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపామన్నారు. మదనపల్లె-అంగళ్లు మార్గమధ్యంలోని అమ్మచెరువుమిట్ట ఆటోస్టాండ్ వద్ద నీరుగట్టువారిపల్లెకు చెందిన వి.రాజు(35) ఏపీకి చెందిన మద్యం..23 నిబ్బులు(180 ఎం.ఎల్.), 6 బీర్లు తరలిస్తుండగా, పట్టుకుని కేసు నమోదుచేశామన్నారు. రామసముద్రం మండలం మినికి గ్రామానికి చెందిన పాతనేరస్థుడు లోకనాథరెడ్డి(58) కర్నాటకకు చెందిన 90ఎం.ఎల్. టెట్రాప్యాకెట్లు 96ను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదుచేశామన్నారు. కోటవారిపల్లె తండాకు చెందిన బి.శంకర్‌నాయక్(47), ఉడుంవారిపల్లెకు చెందిన శివన్ననాయక్(42) కోటవారిపల్లె తండా అడవిలో నాటుసారా బట్టీ నిర్వహిస్తుండగా, దాడులు చేసి 90లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటుగా 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదుచేశామన్నారు.

మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. గురువారం రాత్రి మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దు చీకలబైలు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, మదనపల్లె పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన ఆదినారాయణ కుమారుడు జింకా వేణుగోపాల్ (35), ఏపీ 03 సిసి 6140 నెంబర్ గల ద్విచక్ర వాహనంలో అక్రమంగా కర్ణాటక కు చెందిన రెండు ఫుల్ బాటిల్స్, 20 టెట్రా ప్యాకెట్ల(90ఎం ఎల్) మద్యం తీసుకువస్తుండగా, అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మూడు ఆలయాల్లో చోరీ

రాజంపేట : మండలంలోని వరదయ్యగారిపల్లెలోని మూడు ఆలయాల్లో చోరీ జరిగాయి. శుక్రవారం మన్నూరు పోలీసులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. శ్రీ అక్కమ్మ, ఆంజనేయస్వామి ఆలయం, శివాలయాలలో ఈ చోరీలు జరిగాయి. ఆలయ తలుపుల తాళాలు రంపాలతో కోశారు. హుండీ, బీరువాలో నగదు, అమ్మవారి వస్తువులు చోరీ చేశారు. పోలీసులు ఈ చోరీ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

మృతురాలు వివరాలు లభ్యం


గంగులమ్మ (ఫైల్)

మదనపల్లె : గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటనలో ఆ మహిళ వివరాలు లభించినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. ఈనెల 10వ తేదీన కొత్తపల్లి పంచాయతీ దండువారిపల్లె సమీపంలోని లచ్చారెడ్డి చెరువువద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు సమాచారం అందడంతో, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, మృతదేహం కుళ్లిపోవడంతో అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనలో మృతురాలి ఆచూకీకై ప్రయత్నించగా, ఆమె కుటుంబ సభ్యులు పోలీసులు వద్ద ఉన్న మృతురాలికి చెందిన వస్తువులను గుర్తించారు. తమ కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగా నిర్ధారించారు. పట్టణంలోని ఎన్‌వీఆర్ వీధికి చెందిన రామకృష్ణ భార్య ఎన్ గంగులమ్మ (73), ఈనెల రెండో తేదీన మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అదేరోజు కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే ఆమె అప్పటి నుంచి కొత్తపల్లి సమీపంలో ఇళ్ల వద్ద కనిపించిందని, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో శుక్రవారం ఆరుగురు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండెం మండలం వెలిగిల్లుకు చెందిన మల్లికార్జున భార్య కే.అనిత (26) కుటుంబ సమస్యలతో నేఫ్తలిన్ గోలీలను పొడి చేసుకుని తాగి ఆత్మహత్యకు యత్నించింది.

- రామసముద్రం మండలం బురుజు పల్లి కు చెందిన నారాయణ కుమారుడు కే. గంగాధర్ (40) కుటుంబ సమస్యల కారణంగా పశువులకు స్ప్రే చేసే పిడుదుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు.
- నడింపల్లి పంచాయతీ శ్రీరాములపల్లి కు చెందిన మైనర్ బాలిక మదనపల్లి పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్థాపం చెంది పశువులకు స్ప్రే చేసే పిడుదుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది.
- మదనపల్లి మండలం కోటవారిపల్లెకు చెందిన నాగరాజు కుమారుడు రవీంద్ర (26) పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు.
- పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన మహబూబ్ బాషా కుమారుడు సయ్యద్ బాష (28) కుటుంబ సమస్యలతో గురువారం రాత్రి ఇంటి వద్ద గాజు ముక్కలు తిని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.
- పట్టణంలోని చంద్ర కాలనీకి చెందిన సతీష్ భార్య చిన్న సుబ్బమ్మ(24), స్థానికంగా కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 30 వేలు అప్పు చేసింది. సమయానికి తీర్చకపోవడంతో అప్పు ఇచ్చిన మహిళ ఇంటి వద్దకు వచ్చి అవమానకరంగా మాట్లాడడంతో మనస్తాపం చెందింది. దీంతో ఇంట్లో ఉన్న సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారిస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య


సందీప్‌రెడ్డి (ఫైల్)

గాలివీడు : మండల కేంద్రంలో శుక్రవారం సందీప్ రెడ్డి(24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటప్రసాద్ కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఆవుల శెట్టివారిపల్లె టు నూలివీడు మార్గంలో నివాసముంటున్న మెడికల్ స్టోర్ నిర్వాహకుడు ఎర్రనాగు ప్రతాప్‌రెడ్డి, అరుణమ్మ దంపతుల ఏకైక కుమారుడు సందీప్ రెడ్డి(24) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన నివాసంలో మేడపైన గదిలో ఉంటున్న సందీప్ ఉదయం ఎంతసేపటికీ కిందకు రాకపోవడంతో సందేహం వచ్చిన అతడి తల్లి గది వద్దకు వెళ్లి పదే పదే పిలవసాగింది. ఎంతసేపటికీ తలుపు తెరవకపోవడంతో కంగారు పడిన ఆమె గట్టిగా అరచి చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూస్తే సందీప్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. చేతికందొచ్చిన కొడుకు ప్రయోజకుడై కుటుంబానికి తోడు నీడగా ఉంటాడన్న తరుణంలో ఇలా విగతజీవిలా పడిఉండటం చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. జల్సాలకు అలవాటు పడి ఆర్థిక పరమైన సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

అప్పుల బాధ తాళలేక..


మౌలాలి (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె : అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మౌలాలి(25) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లక్కిరెడ్డిపల్లె మండలం చింతకుంటవాండ్లపల్లెలో చోటు చేసుకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసుల వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతకుంటవాండ్లపల్లెకు చెందిన మౌలాలి లక్కిరెడ్డిపల్లెలో ఎలక్ట్రికల్ షాపు పెట్టుకొని వ్యాపారం చేసుకునే వాడు. మౌలాలికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. అప్పులు ఎక్కువ అవడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఇంట్లోని మిద్దె పైకి వెళ్లి ఎంత సేపటికీ తిరిగి కిందకు రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా అప్పటికే అతను మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు మౌలాలి మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు లక్కిరెడ్డిపల్లె ఎస్.ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై...


నాగేంద్ర మృతదేహం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సుందరయ్యకాలనీలో శుక్రవారం ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సుందరయ్యకాలనీలో నివసించే సల్లా నాగేంద్ర (38) పట్టణంలోని ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య సుభాషిణితో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. అయితే మద్యానికి బానిస అయిన నాగేంద్ర తరుచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా భార్యతో గొడవ పడటంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొద్ది సేపటి తర్వాత వచ్చి చూడగా ఇంట్లోని ఫ్యాన్ కొక్కేనికి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే విషయాన్ని ఆమె బంధువులకు తెలపగా వారు వచ్చి కిందకు దించి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలపడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే మృతుని బంధువుల్లో కొందరు నాగేంద్ర మృతి పై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతుని అక్క రామలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

శ్రీ సిద్ధార్థ విద్యార్థినికి రాష్ట్రస్థాయి మార్కులు


రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె : ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇ.వెంకటరెడ్డి మాట్లాడుతూ...ఇంటర్ ప్రథమసంవత్సరంలో ఎంపీసీ విభాగంలో దేదీప్యసాయి 470 కి 467 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఫస్ట్ ర్యాంకు సాధించిందన్నారు. అలాగే ఇంటర్ ద్వితీయసంవత్సరంలో లహరి ఎంపీసీఎస్ విభాగంలో.. 1000 కి 987 మార్కులు సాధించి టాప్‌ఫస్ట్‌గా నిలిచిందన్నారు. బైపీసీ ప్రథమసంవత్సరంలో 440 కి 432 మార్కులు సాధించి రోహిణి సుహైలా ఉత్తమ ప్రతిభ కనపరిచిందన్నారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

భార్యాభర్తలపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడిన రామచంద్ర, ప్రమీలమ్మ

మదనపల్లె : కూలీ పనులకు వెళ్లిన భార్యాభర్తలపై తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం బి కొత్తకోట మండలంలో జరిగింది. కొత్తపల్లెకు చెందిన కె రామచంద్ర (60) కె ప్రమీలమ్మ (55)దంపతులు. కాగా వీరిద్దరూ కలిసి శుక్రవారం స్థానికంగా చింతకాయలు కోసేందుకు వెళ్లారు. చెట్టు ఎక్కి కాయలు కోసేందుకు ప్రయత్నించగా చెట్టులో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. తేనెటీగల దాడిలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇంటర్ ఫలితాల్లో విశ్వసాయి ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న విశ్వసాయి కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ తదితరులు

నెల్లూరు (అర్బన్) : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి అద్భుత ఫలితాలు సాధించారని విశ్వసాయి జూనియర్ కళాశాల ఛైర్మన్ ఎస్.సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్‌లు తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో 5 స్టెప్ బోధన, ఒత్తిడిలేని విద్యా విధానం, ప్రణాళికా యుత విధానాలతో అద్భుత విజయాలు సాధిస్తున్నామన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను జి. చరిత, సాయిరూపేష్, విజయరాముడు, లిఖిత అనే విద్యార్థులు 465 మార్కులు చొప్పున సాధించారన్నారు. బైపీసీలో 440 మార్కులకు శ్రావ్యారెడ్డి, శామీర్‌లు 435 చొప్పున, రిజ్వాన్, లాలస 434 చొప్పున సాధించారన్నారు. ఎంఈసీలో 500 మార్కులకు షణ్ముక్‌లోకేజిత్ 477 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో వెంకటలక్ష్మి, మధుసూదన్‌లు 985 చొప్పున, వేదాంతకుమార్ 984, లోకేష్ 983 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో 1000 మార్కులకు గాను వి.భాషిత 990, అష్మిత 987, యశ్వంత్‌కుమార్, గురు చంద్రిక 986 చొప్పున, ఎంఈసీలో ఎండీ గుఫ్రాన్ 979 మార్కులు సాధించారన్నారు. ఇలా అనేక మంది మంచి మార్కులు సాధించారన్నారు. వీరందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్‌పర్సన్ రుక్మిణి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బొమ్మవరం గ్రామస్తులు

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలతో పేద ప్రజల తలరాతలు మారాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం గుర్రంకొండ మండలం సరిమడుగు గ్రామంకు చెందిన 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శ్రీరాములు నాయక్, సీతారాములు నాయక్, శీనా నాయక్, దొరస్వామి నాయక్, చంద్రానాయక్, వెంకట్రమణ నాయక్, నాగే నాయక్, గిడ్డా నాయక్, నాన్‌జే నాయక్, మూనే నాయక్ తదితరులు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి నాయక్, నక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పది కుటుంబాలు చేరిక

ఓబులవారిపల్లె : మండలంలోని బొమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల వైస్ ఎంపీపీ గూడూరు గౌరిశంకర్‌రాజు ఆధ్వర్యంలో బొమ్మవరం గ్రామానికి చెందిన చమ్మర్తి శివరాజు, చమ్మర్తి అనంతరాజుతో పాటు పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ముప్పల హేమనవర్మ, చిత్తూరు జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రతాప్, కొలూరు సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అరుణాచలగిరి ప్రదక్షిణ కోసం ఈనెల 22, 23 తేదీల్లో తిరువణ్ణామలైకి రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా ధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- ఈనెల 23న కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా తిరువణ్ణామలైకి బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో రూ. 1072గా ఛార్జి నిర్ణయించారన్నారు.
- ఈనెల 23న పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు సర్వీసు వెళుతుందన్నారు. ఇందులో రూ. 1242 టిక్కెట్ ధరగా నిర్ణయించారన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.